• మీ సేవ కేంద్రాల వద్ద క్యూ

మీ సేవ కేంద్రం ఎదుట బారులు తీరిన ప్రజలు

ఆదిలాబాద్‌లోని మీ సేవ కేంద్రం ఎదుట ప్రజలు బారులు తీరారు. ఈ-కేవైసీతో పాటు ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకోవడానికి ప్రజలు మీ సేవ కేంద్రాల వద్దకు వస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రజా పరిపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తుండడంతో ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవడానికి ప్రజలు మీ సేవ వద్ద క్యూ కడుతున్నారు. -ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 27

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

బోథ్, డిసెంబర్ 27 : అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాకే ఆరు గ్యారంటీల కోసం గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బుధవారం బోథ్‌లోని తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ప్రజా పాలన గ్రామసభల ద్వారా ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం గురువారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నందున తెల్ల రేషన్ కార్డులు నష్టపోయే వీలుందన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసమే మొదట దరఖాస్తులు స్వీకరించాలన్నారు. లేని పక్షంలో ప్రజా పాలన గ్రామసభలను బహిష్కరిస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బీ శ్రీధర్‌రెడ్డి, డీ నారాయణరెడ్డి, మణిందర్‌సింగ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలే యువకుడి హత్యకు కారణం

- ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్
- నిందితులు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- కత్తి, గొడ్డలి, సుత్తె, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ నాగేందర్

ఇచ్చోడ, డిసెంబర్ 27 : ఆస్తి తగాదాలే ఈశ్వర్ హత్యకు కారణమని డీఎస్పీ సీహెచ్ నాగేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇచ్చోడలో ఈ నెల 26వ తేదీన జరిగిన దారుణ హత్యకు ఆస్తి తగాదాలే ప్రధాన కారణమని అన్నారు. ఈశ్వర్‌ను హత్య చేసిన వ్యక్తులు బాబాయ్ వానోలే పాండురంగ్, బాబాయ్ కొడుకు వానోలే సూర్యకాంత్ అని తెలిపారు. కేదాబో కుమారుడైన వానోలే ఈశ్వర్ నాయనమ్మ అయిన లక్ష్మీబాయికి పింఛన్ చేయిస్తానని చెప్పి సంతకాలు తీసుకొని ఎకరం భూమిని ఈశ్వర్ తన పేరు పట్టా చేసుకోవడం జరిగింది. దీంతో ఆరు నెలల నుంచి ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల వ్యవసాయ భూమిలో పాండురంగ్ షెడ్డు వేసుకున్నప్పుడు ఈశ్వర్, తండ్రి వానోలే కేదోబా షెడ్డును ధ్వంసం చేశారు. దీంతో కక్షగట్టి ఇచ్చోడలోని సిరిచెల్మ చౌరస్తాలో మంగళవారం కత్తి, గొడ్డలి, సుత్తెతో ఈశ్వర్‌ను వెంబడించి హత్య చేశారు. నిందితులను బుధవారం ఉదయం ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో పాండురంగ్ ఇంటి వద్దనే పట్టుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి కత్తి, గొడ్డలి, సుత్తె, వారి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. సమావేశంలో ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, నేరడిగొండ, సిరికొండ ఎస్ఐ సాయన్న, నరేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతిని అధికారికంగా నిర్వహించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే

ఎదులాపురం, డిసెంబర్ 27 : భారతదేశం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని జనవరి 3వ తేదీన అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే అన్నారు. ఆదిలాబాద్‌లోని పూలే విశ్రాంతి భవనంలో సంఘం నాయకులుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో స్త్రీ విద్యకు నాంది పలికి, మహిళా సాధికారిత కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే సేవలను ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, యువజన విభాగం అధ్యక్షుడు ఉమేశ్ రావు డోలే, గంగారాం, మాలీ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు

ఇంద్రవెల్లి : నినాదాలు చేస్తున్న మంత్రి సీతక్క

ఇంద్రవెల్లి, డిసెంబర్ 27 : అధికారుల సమన్వయంతోనే ప్రజలకు పరిపాలన అందిస్తూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని అమవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించారు. ముందుగా ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేస్తున్న అమరవీరుల స్మృతి వనం ఏర్పాటు గురించి ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ మంత్రి సీతక్కకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులతో పాటు దళితులు, బీసీ, మైనార్టీలకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ప్రజా పాలనపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి అన్ని విషయాలపై చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, డీపీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

ఉట్నూర్, డిసెంబర్ 27: పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక మొదటి సారిగా ఉట్నూర్‌కు వచ్చిన సీతక్కను బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ దంపతులు మంగళహారతితో సాంప్రదాయ బద్దంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంట్లో కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

ఉట్నూర్, డిసెంబర్ 27: మంత్రిగా ఉట్నూర్‌కు మొదటిసారిగా వచ్చిన సీతక్కను ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ బుధవారం ఎమ్మెల్యే బొజ్జు పటేల్ నివాసంలో శాలువాతో సన్మానించారు. ఏజెన్సీలోని పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఇక్కడ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇచ్చోడ, డిసెంబర్ 27 : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ముక్రా(కే) సర్పంచ్ గాడ్గె మీనాక్షి ఆమెను కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గాడ్గె సుభాష్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు పాండురంగ్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: మాట్లాడుతున్న జడ్పీటీసీ తాటిపల్లి రాజు

తాంసి/బోథ్/బజార్‌హత్నూర్/నార్నూర్, డిసెంబర్ 27 : మండలాల్లో ప్రభుత్వం ఈ నెల 28 నుంచి చేపట్టనున్న ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని బోథ్ మండల పంచాయతీ అధికారి జీవన్‌రెడ్డి, జడ్పీటీసీ తాటిపల్లి రాజు, బజార్‌హత్నూర్, నార్నూర్, జైనథ్ ఎంపీపీలు అజిడే జయశ్రీ, కనక మోతుబాయి, గోవర్ధన్ సూచించారు. బుధవారం బోథ్, జైనథ్‌లోని రైతు వేదికలో, తాంసి, బజార్‌హత్నూర్, నార్నూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో వివిధ శాఖల మండల, క్షేత్రస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాల తీరుపై పలు సూచనలు చేశారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాంసి ఎంపీపీ సురకుంటి మంజుల-శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ -రఘు, నార్నూర్ తహసీల్దార్ జాడి రాజాలింగం, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, ఎంపీఈవో వెంకట్‌రాజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండలానికి అయోధ్య రామయ్య అక్షింతలు

జైనథ్, డిసెంబర్ 27 : అయోధ్య రామయ్య అక్షింతలు బుధవారం మండల కేంద్రంతో పాటు గ్రామాలకు చేరుకున్నాయి. జైనథ్ గ్రామ ప్రజలు, భక్తులు, బీజేపీ నాయకులు అక్షింతలతో పలు వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జైనథ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎన్ ప్రతాప్ యాదవ్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు, అయ్యప్ప స్వామి దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయానికి అక్షింతలు తీసుకొస్తున్న నాయకులు

అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు

బోథ్ కోర్టుకు నిందితులను తీసుకొచ్చిన అటవీ శాఖ అధికారులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 27: అడవుల్లో వన్యప్రాణులను వేటాడి హతమారిస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఇంద్రవెల్లి అటవీ శాఖ రేంజ్ అధికారి సంతోష్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో అడవి పంది మాంసం విక్రయిస్తూ పట్టుబడిన ఉమ, దత్తాత్రిలపై కేసు నమోదు చేసి జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బోథ్‌కు రిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా చెట్లను తొలగించిన, తరలించిన, వన్యప్రాణులను వేటాడిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నర్సయ్య, గోవింద్, ఎఫ్‌బీవో జ్యోత్స్న పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మండల పూజ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. శబరిమలలోని గర్భగుడిలో పని చేసిన బ్రహ్మశ్రీ జయరామన్ నంబూద్రి ఈ పూజకు హాజరయ్యారు. శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠం నుంచి అయ్యప్ప స్వామి దీక్షాపరులు పల్లకీ సేవను పురవీధుల గుండా ఊరేగించారు. అనంతరం ఆలయంలో గణపతి హోమం, అయ్యప్ప స్వామి మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

బోథ్ డివిజన్ కమిటీ ఎన్నిక

బోథ్, డిసెంబర్ 27: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ బోథ్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు దుర్వ విశేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆత్రం మహేందర్, ఉపాధ్యక్షుడిగా కుర్మె రాజన్న, ప్రధాన కార్యదర్శిగా నాగ్‌నాథ్, సహాయ కార్యదర్శిగా కుమ్రం గంగాధర్, కోశాధికారిగా తొడసం ఇస్తారి, సాంస్కృతిక కార్యదర్శిగా కుర్సెంగ ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా మండాడి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

బోథ్ వారసంతలో వసతులు కల్పించాలి

బోథ్, డిసెంబర్ 27: బోథ్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతలో వసతులు కల్పించాలని జక్కుల వెంకటేశ్ బుధవారం మండల పంచాయతీ అధికారి జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. తైబజార్ వేలం ద్వారా ప్రతి ఏటా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయల ఆదాయం వస్తుందన్నారు. సంతకు దూర ప్రాంతాల నుంచి వ్యాపారులు, పల్లెల నుంచి కొనుగోలుదారులు వస్తున్న వారికి తాగునీరు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారసంతలో వసతులు కల్పించాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇచ్చోడ, డిసెంబర్ 27 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సాగర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 57 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, రాథోడ్ కైలాస్, రాజ్‌కిరణ్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన ఉండాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 27: ఆర్థిక లావాదేవీలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని నాబార్డు అధికారి రాంరెడ్డి అన్నారు. బుధవారం ఘన్‌పూర్ గ్రామంలో నాబార్డు సౌజన్యంతో సహకార బ్యాంకు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ బ్యాంకులో పొదుపు ఖాతా తప్పని సరిగా ఉండాలని అన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలని అన్నారు. సహకార బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న ప్రధాన మంత్రి జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంద్ర లత, తిరుమలేశ్, స్వప్న, గ్రామ పటేల్ కనక లచ్చు, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రాజు, రైతులు పాల్గొన్నారు.

6.91 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

మాట్లాడుతున్న జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్

బోథ్, డిసెంబర్ 27: ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 6,91,068 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం బోథ్‌లోని మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని సందర్శించారు. పత్తి కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంవో మాట్లాడుతూ సీసీఐ ఆధ్వర్యంలో 19,700 మంది రైతులకు చెందిన 3,93,438 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని ఆరు కేంద్రాలు, ఇంద్రవెల్లిలోని మూడు కేంద్రాలు, ఇచ్చోడలోని రెండు, నార్నూర్, బేలల్లోని ఒక్కో కేంద్రంతో పాటు ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తిని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు జిన్నింగ్ మిల్లుల్లో 2,97,630 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింకు చేసుకోవాలని సూచించారు. లేని పక్షంలో ఖాతాలో డబ్బులు జమ కావడానికి ఆలస్యం జరిగే అవకాశం ఉందన్నారు. డీఎంవో వెంట మార్కెట్ కమిటీ కార్యదర్శి దేవన్న, ఏఎంసీ స్వామి, సిబ్బంది ఉన్నారు.

నార్నూర్ మండల అభివృద్ధికి సహకరించాలి

నార్నూర్, డిసెంబర్ 27 : నార్నూర్ మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం ఆదిలాబాద్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. నార్నూర్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని, మండల కేంద్రం నుంచి గాదిగూడ(ఎల్లపూర్) వరకు డబుల్ బీటీ రోడ్డు, తాడిహత్నూర్ నుంచి నార్నూర్‌కు డబుల్‌రోడ్డు, కొత్తపల్లి(హెచ్), ఎంపల్లి, మరపగూడ, మలంగికి చెరువులు మంజూరు చేయాలని, ఆదివాసీ ఆరాధ్యదైవం ఖాందేవ్, జంగుబాయి దేవస్థానంతో పాటు కొత్తపల్లి(హెచ్)లోని లంబాడీ గిరిజనుల సేవాలాల్ దీక్ష భూమికి రూ.కోటి చొప్పున మంజూరు చేయాలని, పలు గ్రామాలకు బీటీరోడ్లు, ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయాలని కోరారు. ఇక్కడ ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ మాజీ చైర్మన్ తొడసం నాగోరావ్, నాయకులు గోపాల్, రాహుల్, రూప్‌దేవ్, రాథోడ్ రామేశ్వర్, విష్ణు, రవీందర్, కనక ప్రభాకర్, పైకు ఉన్నారు.

ఘనంగా అన్నపూర్ణ జయంతి

తాంసి, డిసెంబర్ 27 : మండలంలోని బండల్‌నాగపూర్ గ్రామంలోని రామాలయంలో ఆలయ పూజారి రవి ఆధ్వర్యంలో అన్నపూర్ణ జయంతిని నిర్వహించారు. గణపతి, నవగ్రహ పూజతో పాటు ధాన్యరాసులకు ప్రత్యేక పూజలు, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. సాక్షాత్తూ పార్వతీ దేవియే అన్నపూర్ణ దేవిగా అవతరించిన రోజు అని పురాణాలు చెబుతున్నాయని ఆలయ పూజారి వివరించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజులాశ్రీధర్ రెడ్డి, జడ్పీటీసీ రాజు, సర్పంచ్ వెంకన్న, కృష్ణారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

11న హైమన్‌డార్ఫ్ వర్ధంతి సభ

కరపత్రాలు విడుదల చేస్తున్న ఆదివాసీ గిరిజన నాయకులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో జనవరి 11వ తేదీన నిర్వహించే ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ దంపతుల 37వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు కనక వెంకటేశ్, జుగ్నాక్ ధర్మేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద వర్ధంతికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవిబిడ్డల జీవన స్థితిగతులపై అధ్యయనం చేయడానికి వచ్చి తమ జీవితాన్ని దారపోశారన్నారు. వర్ధంతి సభకు ఆదివాసులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మడావి మహదు, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ కుమ్ర సుధాకర్

భీంపూర్, డిసెంబర్ 27: గుంజాల గ్రామంలో గిరిజాబాయి యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను జడ్పీటీసీ కుమ్ర సుధాకర్ ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.21,000, రెండో బహుమతి రూ.15,000, మూడో బహుమతి రూ.11,000, నాలుగో బహుమతి రూ. 7,000, ఐదో బహుమతి రూ. 5,000 అందజేయనున్నారు. జిల్లా నుంచి కాకుండా మహారాష్ట్ర నుంచి జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడిమెత రత్నప్రభ, వైస్ఎంపీపీ గడ్డం లస్మన్న, సర్పంచ్‌లు ఆత్రం లలిత పైకు, మడావి లింబాజీ, ఉపసర్పంచ్‌లు మడావి వినోద్, జాదవ్ రవీందర్, ఎస్ఐ లాల్‌సింగ్‌నాయక్, నాయకులు సంజీవ్‌రెడ్డి, కుడిమెత సంతోష్, ఈశ్వర్, బేరు పటేల్ పాల్గొన్నారు.

పాఠశాల నిర్మిస్తా

అభినవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 27 : సిరికొండ మండలంలో కొత్తగా ఏర్పడిన కోసుగూడ గ్రామంలో పాఠశాల లేకపోవడంతో బుధవారం ప్రముఖ సినీనటుడు అభినవ్ సర్దార్ సందర్శించారు. తన అభినవ్ ఫౌండేషన్ ద్వారా నూతన భవనం నిర్మిస్తానని తెలిపారు. ఆయనను గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు యాదవ్‌రావ్, రాథోడ్ అనిల్ పాల్గొన్నారు.

రాంమందిర్‌లో కొనసాగుతున్న జాతర

గుడిహత్నూర్, డిసెంబర్ 27 : మండలంలోని ఉమ్రి గ్రామ పంచాయతీ పరిధిలోని పురాతన రాంమందిర్‌లో దత్త జయంతి పురస్కరించుకొని జాతర కొనసాగుతుంది. దత్త జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు హరినామ సప్తాహం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఏక్‌నాథ్ మహారాజ్ ఆధ్వర్యంలో ముగింపు సందర్భంగా రాంమందిర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. భక్తుల కోసం సామూహిక అన్నదానం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంతో పాటు ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బజార్‌హత్నూర్, నేరడిగొండ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు

ఎదులాపురం, డిసెంబర్ 27 : జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు జిల్లాలోని దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులు, నాయకులు, దివ్యాంగుల స్వయం సహాయక గ్రూపు సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు హాజరుకావాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

తాంసి, డిసెంబర్ 27 : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ అండె అశోక్ అన్నారు. మండలంలోని పొన్నారి గ్రామంలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంస్థ సభ్యులు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాటిపల్లి రాజు, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ- రఘు, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, మహిత సిబ్బంది ఇమ్రాన్, రాములు, వర్ష, బాలల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల నియామకం

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 27: ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన దరఖాస్తుల కోసం ప్రత్యేకంగా సిరికొండ మండలానికి టీం లీడర్‌గా తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో సురేశ్‌ను నియమించారు. ఈ నెల 28న వాయిపేట్, సిరికొండ గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇచ్చోడలో..

ప్రజాపాలన దరఖాస్తుల కోసం ప్రత్యేకంగా ఇచ్చోడ మండలానికి టీం లీడర్‌గా ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ తుకారాంను నియమించారు. ఈ నెల 28న దేవుల్‌నాయక్‌తండా, దుబర్‌పేట్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందాలి

భీంపూర్, డిసెంబర్ 27 : గ్రామాల్లో అందరికీ క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందాలని భీంపూర్ పీహెచ్‌సీ హెచ్‌ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్ సూచించారు. బుధవారం అందర్‌బంద్ గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది సంధ్యారాణి, విజయలక్ష్మి ఉన్నారు.

ఆర్టీసీ బస్సులను పునః ప్రారంభించాలి

బోథ్, డిసెంబర్ 27 : బోథ్ మండలంలోని కొన్ని మార్గాల్లో ఆర్టీసీ బస్సులను పునః ప్రారంభించాలని బుధవారం ఆదిలాబాద్‌లో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్‌కు ఎంపీటీసీ మహేందర్ వినతిపత్రం ఇచ్చారు. బోథ్ నుంచి నిగిని వరకు (నిర్మల్ డిపో), బోథ్ నుంచి ధన్నూర్ (ఆదిలాబాద్ డిపో), బోథ్ నుంచి కన్గుట్ట, కౌత, సాకేర, సోనాలకు వరకు విద్యార్థుల కోసం నడిపే బస్సును పునరుద్ధరించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో వీడీసీ చైర్మన్ గంగాధర్, రాజశేఖర్ ఉన్నారు.